క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్పీవో ప్రకాష్‌నాయుడు

తుగ్గలి : గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర సమస్యలపై దృష్టి సారించాలని, పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని పత్తికొండ డివిజనల్ లెవెల్ అధికారి ప్రకాష్‌నాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలపై ఆరా తీసిన ఆయన పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

అధికారుల బదిలీ

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్ఎం బాషా ప్యాపిలి మండలానికి, జూనియర్ అసిస్టెంట్ రామ్‌బ్రహ్మం నదిచాగికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. వారి స్థానంలో ఇంకా ఎవరూ బాధ్యతలు చేపట్టలేదు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎద్దులదొడ్డిలో సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేస్తున్న వైఎస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

తుగ్గలి : రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం ఎద్దులదొడ్డి రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరు శనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగుకు ముందే పెట్టుబడి సాయం, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో కాశీరంగస్వామి, వ్యవసాయశాఖ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయమోహన్‌రెడ్డి, దేవేంద్ర పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

తుగ్గలి : మండల పరిధిలోని జొన్నగిరి తండాలో మంగళవారం సాయంత్రం గాలి, వానతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి తండాలోని పెద్దరా ముడునాయక్ ఇంటి పైకప్పు కూలిపోయింది. మిరప పంట దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లినట్లు పలువురు రైతులు వాపోయారు. దెబ్బతిన్న మిరప తోటలను జెడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్, సర్పంచ్ లక్ష్మి పరిశీలించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గోనెగండ్ల: ఎమ్మిగనూరు పట్టణంలో ఈనెల 24న జరిగే చర్మకారుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండీ ఆనంద్ బాబు, మండల అధ్యక్షుడు లోకన్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం గోనెగండ్లలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దస్తగిరి, రాముడు, సెన్నప్ప పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందవరం : పత్తి పంటలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల రిసోర్స్ పర్సన్ ఆఫ్రీన్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో రిలయన్స్, ఆర్డిప్ సంస్థ ఆధ్వర్యంలో పత్తి పంటలో రైతులు పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతులు పత్తి పంటను జూన్ మాసంలో కాకుండా ముందస్తుగా వేయడంతో ఎర్ర తెగులు వ్యాప్తి చెంది నష్టపోతున్నారని వివరించారు. అదేవిధంగా విత్తనాల ఎంపికలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆర్డిప్ కార్యకర్త ఉసేని, వీఏఏ ఇంద్రాణి, సీఈఓ తిమ్మప్ప పాల్గొన్నారు.

తెలంగాణ ట్రాక్టర్లు సీజ్

నందవరం : తుంగభద్ర నదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తెలంగాణ ఇసుక ట్రాక్టర్లను నందవరం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మండల పరిధిలోని గురజాల గ్రామంలోని తుంగభద్ర నదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తెలంగాణలోని పులికల్లు గ్రామానికి చెందిన బోయ కొత్తింటి శ్రీనివాసులు, బోయ నరేంద్ర, రాంపోగు నరసింహుడు, బోయ కొత్తింటి చిన్నహనుమంతు, బోయ కొత్తింటి హరికృష్ణ, కురువ యల్లప్ప, బడేసాబ్, మేడికొండ గ్రామం బోయ పెద్దరాముడుకి చెందిన 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

భూసార పరీక్ష.. పంటలకు రక్ష

- 16 ఆర్బీకేల పరిధిలో మట్టి నమూనాల సేకరణ
- ఫలితాల ఆధారంగా ఎరువులు, మందుల వాడకం మేలు
- దిగుబడులు పెరిగేందుకు దోహదం



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పత్తికొండ రూరల్ : భూసార పరీక్షలు రైతులకు ఎంతో మేలు చేకూరుస్తాయి. పొలాల్లో ఇష్టారాజ్యంగా ఎరువుల వాడకం మూలంగా భూసారం దెబ్బతింటుంది. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు, మందుల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వం రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆర్బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపారు.

20 మట్టి నమూనాల సేకరణ

మండలంలో ప్రధాన పంటలు వేరుశనగ 7,664 ఎకరాలు, పత్తి 20,535, ఆముదం 866, కంది 635ఎకరాల్లో తదితర పంటలు సాగుచేయనున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా. భూసార పరీక్షల్లో భాగంగా మండలంలోని 16 ఆర్బీకేల పరిధిలో ఒక్కో ఆర్బీకే నుంచి 20 మట్టి నమూనాలు సేకరించి ఎమ్మిగనూరు మండలం ముగితిలో ఉన్న భూసార పరీక్ష కేంద్రానికి తరలించినట్లు ఏఈఓ రియాజ్‌బాషా తెలిపారు. ఈఏడాది కచ్చితమైన భూసారాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక యాప్ ద్వారా మట్టినమూనాల సేకరణ జరుగుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. భూసార పరీక్ష ఇచ్చిన రిపోర్టు అనుసరించి ఆయా భూముల్లో ఏపంటలు పండించాలి, ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలో కూడా తెలుస్తుంది.

అవగాహన లేమితో ఇష్టారాజ్యంగా ఎరువుల వాడకం

చాలా మంది రైతులు తమ పొలాలలో అధిక దిగుబడులు సాధించాలనే కోరికతో ఇష్టారాజ్యంగా రసాయనిక ఎరువులు వాడుతుంటారు. దీనివల్ల పెట్టుబడులు పెరిగిపోవడమే కాకుండా పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అందుకోసమే పోషకాల సమతుల్యత పాటించేందుకు రసాయనిక ఎరువులు సరైన మోతాదులో వాడేందుకు భూసార పరీక్షలు ఎంతో అవసరం.

రైతులు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రతి రైతు సాగుచేసే పొలంలో సూక్ష్మపోషకాలు లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని. సూక్ష్మపోషకాలుగా పిలువబడే జింకు, బోరాన్, జిప్సమ్, (కాల్షియం, గంధకం) లోపిస్తే గుర్తించి సకాలంలో వాటిని సాగుచేసుకుని దిగుబడులు పెంచుకునే వీలుంది. ఖరీఫ్ సాగుకు ముందుగానే ప్రతిరైతు తమ పొలాల్లో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించుకుని దాని ప్రకారంగా చర్యలు తీసుకోవడం మంచిదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం రైతాంగానికి 50 శాతం రాయితీపై సూక్ష్మపోషకాలను వ్యవసాయ శాఖ ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తుంది.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



భూసారం బాగుంటేనే పంటల దిగుబడి బాగుటుంది. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే వాటిని సాగుచేసుకుని వేసవి దుక్కులు చేయడం మంచిది. రైతుల కోరిక మేరకు మట్టినమూనాలు తీసుకుంటున్నాం. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు దగ్గరలోని ఆర్బీకే కేంద్రాలను సంప్రదించాలి. ఆ తరువాత మట్టినమూనాలు తీసుకుని భూసార పరీక్షలు చేయించుకోవచ్చు. – వెంకట్రాముడు, మండల వ్యవసాయ అధికారి, పత్తికొండ

నేడు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో గురువారం శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామ పెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నందవరం : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులను పీఆర్ఏఈ జయన్నతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని, అందులో భాగంగా ఎంపీపీ నిధులు ద్వారా గ్రామానికి రూ.8 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైయినేజీలు పూర్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళ మార్ట్ వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గోనెగండ్ల: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్‌తో కలిసి మండల కేంద్రం గోనెగండ్లలో మహిళ మార్ట్ ఏర్పాటు చేసేందుకు భవనాలను పరిశీలించారు. గోనెగండ్ల సహకరం సంఘం గోడౌన్, షాపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పొదుపు మహిళలందరూ కలిసికట్టుగా జీవనోపాధి పొందుటకు మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు ప్రతి మండలంలో మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మార్ట్ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులు తదితర వాటిని గూరించి మహిళలకు వివరించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో మాట్లాడారు. శ్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు.

మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాకీర్‌హుసేన్

తుగ్గలి : మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలని, దీనికి అధికారుల సహాయ సహకారాలు అవసరమని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో మండల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1642 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 439 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మరో 824 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారుల వద్దకెళ్లి నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపకపోతే అలాంటి లబ్ధిదారుల పట్టాలు రద్దు చేయాలని చెప్పారు. ఖరీఫ్ సాగులో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవి, హౌసింగ్ ఏఈ విజయకుమార్, ఏపీఎం రాధాకృష్ణ, పంచాయతీకార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధే అమృత్ సరోవర్ లక్ష్యం



పెనుమాడ చెరువు వద్ద అమృత్ సరోవర్ కింద చేపట్టిన పనులను పరిశీలిస్తున్న అధికారులు

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం కింద చెరువుల అభివృద్ధే లక్ష్యంగా అమృత్ సరోవర్ పనులు చేపట్టడం జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోయినిద్దీన్, గ్రౌండ్ వాటర్ ఏడీఏ పోతులయ్య తెలిపారు. మండల పరిధిలోని పెనుమాడ చెరువులో గతేడాది అమృత్ సరోవర్ కింద చేపట్టిన పనులను బుధవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలతో చెరువుల్లో మట్టి తీసి కట్టకు పోయడం, నీటి నిల్వ ఉంటేలా తదితర పనుల కింద ఈ చెరువులో రూ.9.5 లక్షలతో పనులు చేపట్టారన్నారు. ఈ పనులు ఉపయోగంగా ఉన్నాయా లేదా అని వారు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట సోషల్ ఆడిట్ డీఆర్‌పీ ఓబులేసు, ఏపీడీ లక్ష్మన్న, ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, టీఏ చెన్నకేశవులు, సీనియర్ మేటీలు భాస్కర్, రాజశేఖర్ ఉన్నారు.

మద్దికెర : అమృత్ సరోవర్ పథకం కింద జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఈఈ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక యజ్ఞం చెరువులో జరిగిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువుల్లో పూడికతీత, మట్టి తరలించడం వంటి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ మణికంఠ, ఏపీఓ రవీంద్రనాథ్, ఈసీ రాఘవేంద్ర, టీఏ నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ వున్నారు.


ప్రశాంత జీవనం గడపాలి

వెల్దుర్తి, కృష్ణగిరి: గ్రామీణ ప్రజలు క్షణికావేశాలకు గురై ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం గడపాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి చెరుకులపాడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పోలీసు పికెటింగ్‌ను తనిఖీ చేశారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫ్యాక్షన్‌కు దూరంగా కుటుంబాలు అభివృద్ధి దిశగా సాగాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎవరినీ ఉపేక్షించమన్నారు. అనంతరం కృష్ణగిరి మండల పరిధిలోని పుట్లూరు అమ్మవారి ముఖద్వారం ఎదురుగా రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డీఎస్పీ సమక్షంలో అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. వెల్దుర్తి, కృష్ణగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడ్డ 3 వేల టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామంలో కోడుమూరు సెబ్ సీఐ శ్యాంప్రసాద్, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి బృందాలు బుధవారం జరిపిన దాడుల్లో బి. రామాంజనేయులును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 5లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ తెలిపారు.

ప్రాజెక్టు మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలి



జీడీపీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించకుండా చేయాలని ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ శైలేశ్వర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం వారు గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంచేందుకు ప్రభుత్వం రూ.57 కోట్లను మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రాజెక్టు కట్ట పెంచేపనులతో పాటు రూ.4.8కోట్లతో క్రస్ట్‌గేట్ల మరమ్మతు పనులను కూడా చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ప్రాజెక్టు 4,5,6 గేట్లను మూసివేసి పనులు చేపడుతున్నారు. మరమ్మతు పనులు ఆగస్టు లోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈ విజయ్ కుమార్, ఏఈ మహమ్మద్ అలీ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఉగ్ర పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కృష్ణగిరి: అనుమతులు లేకుండా ఎవరైనా విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ ఎస్. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన రైతులతో మాట్లాడారు. చాలా గ్రామాల్లో పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు ఏ విత్తనమైనా గుర్తింపు పొందిన షాపుల నుంచి కొనుగోలు చేసి, రశీదు పొందాలని సూచించారు. ఖరీఫ్‌కు సంబంధించి అన్ని ఆర్బీకేల్లో వేరుశనగ, కంది, కొర్ర విత్తనాలు సబ్సిడీ కింద అందజేస్తున్నామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వెల్దుర్తి: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ పరిసర పొలంలో జరుగుతున్న పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న కలుగొట్లకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి సెల్‌ఫోన్‌లు, రూ.16,200, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బుధవారం తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఆస్పరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్య పుస్తకాలను ఏంఈఓ రాజేంద్ర ప్రసాద్ బుధవారం ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. 53 పాఠశాలలకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 63వేల పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. అలాగే 2వేలు డిక్షనరీలు, విద్యార్థులకు 9428 మందికి బూట్లు, బ్యాగులు వచ్చాయన్నారు.

‘ఉపాధి హామీ’ని అనుసంధానం చేయాలి

కృష్ణగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఖలీల్, ఉపాధ్యక్షుడు రవిమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం వారు పలు డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన అనంతరం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.15వేలు, అలాగే 90శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు అందజేయాలన్నారు. పరమేశ్వరరెడ్డి, సుంకన్న, ఆర్బీ మాధవస్వామి తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందాం

పత్తికొండ రూరల్: హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందామని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలోని శివాలయంలో ధార్మిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గోపూజ చేశారు. అనంతరం పండితుడు రాజాజయచంద్రన్ రామాయణ, మహాభారతంలోని ప్రవచనాలను వినిపించారు. కార్యక్రమంలో సర్పంచు కె.హరిత, గ్రామనాయకుడు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

హొళగుంద: హాలహర్వి మండలం విరుపాపురంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం ఎల్లార్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామపెద్ద బోయ మల్లికార్జున, ఆయన సోదరుడు లక్ష్మికాంత్ రూ.10 వేల నగదును విరాళమిచ్చారు. హొళగుంద, హాలహర్వి మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పంచగుండిగ వెంకటేష్‌తో పాటు కార్యక్రమ నిర్వాహకులు ఎల్లార్తికి వచ్చి మల్లికార్జున సహకారం కోరారు. ఈ మేరకు స్పందించిన ఆయన తన వంతుగా రూ.10 వేల నగదును అందజేశారు.

కర్ణాటక మఠానికి బియ్యం విరాళం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం గదగలోని పుట్టరాజు గవాయిస్వామి మఠానికి విరాళం ఇచ్చేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి సేకరించిన 470 బస్తాల బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను బుధవారం స్థానిక యువకులు కర్ణాటకలోని మఠం నిర్వహకులకు అందజేశారు. మఠంలో చదివే అంధ విద్యార్థులతో పాటు అనాథలకు, భక్తులకు నిత్యం అన్నదానం, ఉత్సవాలు, ఇతర శుభ కార్యాలకు నిర్వహించేందుకు ఇక్కడి భక్తులు ప్రతి ఏటా బియ్యం, సరుకులు పంపిస్తారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

హొళగుంద: పనుల్లో వేగం పెంచి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని మండల ప్రత్యేకధికారి రామచంద్రయ్య కింది స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హొళగుంద ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనులు, జగనన్న ఇళ్ల నిర్మాణాలు తదితర పనుల్లో పురోగతి సాధించాలన్నారు. అదేవిధంగా వివిధ సమస్యలతో సచివాలయాలకు వచ్చిన ప్రజలకు పరిష్కార మార్గం చూపాలని, వారి నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళీశ్వరగౌడ్, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, హౌసింగ్ డీఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు

పత్తికొండటౌన్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ నారాయణదాసు అధ్యక్షతన జరిగిన మండలమీట్ వాడివేడిగా సాగింది. 11గంటలకు మండలమీట్ ప్రారంభం కావాల్సి ఉండగా, కొన్ని శాఖల అధికారులు హాజరు కాలేదు. దీంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు కేశవరెడ్డి, రహిమాన్, శ్రీరాములు అధికారుల తీరును తప్పుపట్టారు. అధికారులు హాజరు కానప్పుడు సమస్యల గురించి ఎవరిని అడగాలని ప్రశ్నించారు. అధికారులు రానప్పుడు మేమెందుకు ఉండాలని సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు. అనంతరం సమావేశం ప్రారంభం అయింది. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారాయణదాసు, ఎంపీడీఓ పార్థసారథి మాట్లాడుతూ అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల మీట్‌కు కూడా సక్రమంగా రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇకపై ఉపేక్షించబోమని, మండలమీట్‌కు సక్రమంగా రానివారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో నాటుసారా అమ్మకాలు, కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని దేవనబండ సర్పంచ్ ప్రవీణ, దూదేకొండ ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న కోరారు. ఉపాధిహామీ పథకం క్రింద పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ వెంకటేశ్వర్లు కోరారు. సమావేశంలో తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఈఓఆర్డీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీలు బలరాముడు, వడ్డేరంగమ్మ, సూపరింటెండెంట్ స్వర్ణలత, హౌసింగ్, విద్యుత్ ఏఈలు వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, పంచాయతీరాజ్ ఏఈ అబ్బావెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విష్ణువర్ధనరెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఎక్సైజ్ ఎస్ఐ జబ్రుల్లా, ఎంపీటీసీ సభ్యులు నీలకంఠ, నెట్టేకల్లు, కేశప్ప, కృష్ణారెడ్డి, రాజు, చంద్ర, వీరన్న, సర్పంచులు విజయలక్ష్మి, ప్రవీణ, అంజినయ్య, రహిమాన్, శ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రబాడు చెరువు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న అమృత్ సరోవర్ టీం అధికారులు

గోనెగండ్ల : మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ కింద చెరువులో పూడికతీత పనులను బుధవారం అమృత్ సరోవర్ టీమ్ అగ్రికల్చర్ ఏడీ గిరీష్ కుమార్, సోషల్ ఆడిట్(డీఆర్పీ) భగవన్‌లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అమృత్ సరోవర్ కింద ఎర్రబాడు గ్రామంలో రూ.9లక్షలతో చెరువులో పూడికతీత, ముళ్లకంపలు తొలగించడం పనులు జరుగుతున్నాయి. అలాగే చెరువుకు కాలువలు ఏర్పాటు చేయడం జరగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మహమ్మద్, ఈసీ ఉస్మాన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి



మల్లికార్జునయ్య

ఆలూరు: పల్లె ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మల్లికార్జునయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన గ్రామాల్లోని ఎస్ఎస్‌ట్యాంకులను పరిశీలించారు. డీఈ కార్యాలయంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. హాలహర్వి మండలం బాపురం, చింతకుంట, సమ్మత్‌గేరి, విరుపాపురం గ్రామాల్లోని ట్యాంకులకు ఎల్లెల్సీ కాలువకు విడుదలైన నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

హొళగుంద: మండల వ్యవసాయాధికారిగా ఆనంద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న నరేంద్రకుమార్ ఆస్పరి మండలానికి బదిలి అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురంలో పోస్టింగ్ ఉండి చిప్పగిరి మండల వ్యవసాయాధికారిగా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌ను హొళగుంద ఏఓగా నియమించారు.

ఆస్పరి ఏఓగా నరేంద్ర కుమార్

ఆస్పరి: ఆస్పరి ఏఓగా నరేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న మునెమ్మ పత్తికొండకు బదిలీ కాగా ఆమె స్థానంలో హొళగుందలో పని చేస్తున్న నరేంద్ర కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఏపీఓగా శ్రీనివాసులు

నందవరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఏపీఓ మాలిక్‌బాషా ఏలూరుకు బదిలీ అయ్యారు. ఏపీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ..గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి, కూలీల సంఖ్య పెంచుతామన్నారు. వలస నివారణకు కృషి చేస్తామని తెలిపారు.

సంక్షిప్తం

రైతు భరోసా కేంద్రాల తనిఖీ

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఏఓ హేమలత తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతు భరోసా కేంద్రాల సహాయకులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు మహేంద్ర, షఫీ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

ఆలూరు రూరల్: అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి సూచించారు. బుధవారం ఆయన ఆలూరులోని సచివాలయం–3 పరిధిలో ఫ్యామిలీ ఫిజిషయన్‌లో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

సన్మానం

మద్దికెర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్తున్న విజయలలిత, సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ అడ్మినిస్ట్రేటివ్‌గా పదోన్నతిపై వెళ్తున్న శ్రీనివాసులను బుధవారం ఎంపీడీఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగస్వామి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓ శ్రీహరి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ యత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న రవి అనే వ్యక్తి ఎలక్ట్రికల్ దుకాణంలో బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి చోరీకి యత్నించిన సంఘటన చోటు చేసుకుంది. షాప్ యజమానికి రవి పక్కనే ఉన్న టీ స్టాల్ దగ్గరకు టీ తాగేందుకు వెళ్లాడు. అంతలో ఓ వ్యక్తి షాప్‌లో చొరబడి కుర్చీలో కూర్చొని లాకర్ తెరుస్తుండగా గమనించిన యజమానికి అక్కడికి చేరుకున్నారు. ఆ వ్యక్తిని పట్టుకొని చుట్టుపక్కల వారు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విషయాన్ని పట్టణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా మద్యం మత్తులో షాప్‌లోకి వెళ్లాడని, విచారిస్తున్నామని, కేసు నమోదు చేయలేదని తెలిపారు.

బాల్యవివాహాలను అరికట్టండి

ఆలూరు/హాలహర్వి: మండలంలో పెళ్లీడుకు రాని పిల్లలకు వివాహాలు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం పలు గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప, వైస్ ఎంపీపీ నాగేష్, తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ అంటోని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 11న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులు పంపిణీ చేయనున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.

10న విగ్రహాల ప్రతిష్ఠ

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె సమీపాన హైవే 44 ప్రక్కన ఉన్న భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10న దేవతా విగ్రహాల ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపా రు. గురువారం గణపతి పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమై మూడు రోజులు సాగుతాయన్నారు.